## • యాదగిరిగుట్టలో న్యూ ఇయర్ శోభ



యాదగిరిగుట్ట లక్ష్మీనారసింహస్వామివారి దివ్యక్షేత్రంలో నూతన సంవత్సర శోభ సంతరించుకున్నది. సోమవారం సెలవు కావడంతోపాటు కొత్త ఏడాది ప్రారంభం రోజున స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం, పుష్కరిణి, క్యూలైన్లు, క్యూ కాంప్లెక్స్, ప్రసాద విక్రయశాల, బస్సు ప్రాంగణాలు కిటకిటలాడాయి. ధర్మ దర్శనానికి 5 గంటలు, వీఐపీ దర్శనానికి 4 గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు.

–యాదగిరిగుట్ట

# నైరుతి తీరంలో జన్యు వైవిధ్యం

• **పార్శీలు, రోమన్ల వలసలే కారణం..సీసీఎంబీ పరిశోధనలో వెల్లడి**

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 1(నమస్తే తెలంగాణ): భారతదేశానికి నైరుతి తీర ప్రాంతం సాంస్కృతిక వైవిధ్యంతోపాటు జన్యుపరమైన వైవిధ్యాలను కలిగి ఉన్నదని తాజా పరిశోధనలో వెల్లడైంది. పార్శీలు, జ్యూషీలు, రోమన్ల వలసల కారణంగా ఈ ప్రాంతం ఎన్నో జన్యు మార్పులను కలిగి ఉన్నదని సీసీఎంబీ శాస్త్రవేత్తలు చెప్తున్నారు. ఈ ప్రాంతంలో నివాసం ఉండేవారి జన్యువులు పురాతన, చారిత్రక నేపథ్యం ఉన్న కొన్ని రాజ, భూస్వామ్య, క్షత్రియ వంశీయుల జన్యువులతో పోలి ఉన్నాయని సీసీఎంబీ పరిశోధకుడు కుమారస్వామి తంగరాజన్ బృందం చేసిన జన్యు విశ్లేషణలో తేలింది. దేశానికి నైరుతి తీరప్రాంతమైన కేరళ నుంచి గుజరాత్ వరకు చారిత్రక నేపథ్యం ఉన్న పోరాటయోధుల, భూస్వాముల డీఎన్ఏ నమూనాలు.. పార్శీలు, రోమన్ల కాలం నాటి వ్యక్తులతో పోలి ఉన్నట్టుగా గుర్తించారు. ఈ బృందం ఈ ప్రాంతంలోని క్షత్రియ, భూస్వామ్య వంశ నేపథ్యం ఉన్న కుటుంబాల డీఎన్ఏను పరిశీలించింది. కేరళకు చెందిన నాయర్లు, తియ్యా, ఈజ్వా వంశీయులతోపాటు కర్ణాటకలోని బంటా, హోయసల వంశీయుల జన్యు రూపాల్లో సారూప్యతలు ఉన్నట్టుగా తేల్చారు. వీరి జన్యురూపాలు రాజస్థాన్, గుజరాత్‌లోని గుజ్జర్లు, కంబోజ్ వర్గాలతో పోలి ఉన్నాయని పేర్కొన్నారు. మాతృ జన్యువుల్లో ఉన్న మైటోకాండ్రియా నమూనాలు వెస్ట్ యురేషియాకు చెందిన వారివిగా తేల్చారు. వీరంతా నైరుతి నుంచి మధ్య భారతానికి, అక్కడి నుంచి వాయువ్య భారతానికి వలస వెళ్లారని చెప్తున్నారు. మెషిన్‌లెర్నింగ్ జీనోమ్ విశ్లేషణ ద్వారా రాతియుగం నాటికి చెందిన వారిలో ఈ జన్యువులు ఉన్నాయని గుర్తించినట్టు పరిశోధనలకు ప్రాతినిధ్యం వహించిన డాక్టర్ లోమస్‌కుమార్ వెల్లడించారు.


**SHILPARAMAM ARTS, CRAFTS & CULTURAL SOCIETY**
Madhapur, Hyderabad
**SHORT TENDER NOTICE**
In Continuation of the Tender Notice published on 11-11-2023 in Namasthe Telangana Daily News Paper. Shilparamam, Madhapur, Hyderabad Invites Tenders from the qualified Security Agencies to apply to reach the under signed on or before 06-01-2024 at 03.00 P.M. website: **www.shilparamam.in** may be visited for details.
Sd/- Special Officer, Shilparamam



**దక్షిణ మధ్య రైల్వే**
Follow us on @SCRailwayindia ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.inపై చూడవచ్చును.
**ప్రొఫార్మా 10-01**
**"బహిరంగ ప్రకటన"**
PUB/0003
దక్షిణ మధ్య రైల్వేలోని దిగువ తెలిపిన సెక్షన్‌లో పూర్తి చేయబడిన సెక్షన్‌లోగల రైల్వే లైన్లు మరియు ఆవరణలు వినియోగించు వారందరికీ ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా, 25000 ఓల్టులు, 50Hz, ac ఓవర్‌హెడ్ ట్రాక్షన్ వైర్లలో సెక్షన్‌కు ఎదురుగా నిర్ధేశించిన తేదీన లేదా ఆ తరువాత విద్యుత్ సరఫరా జరుగుతుంది. సదరు తేదీన మరియు నుండి అన్నివేళలా ఓవర్‌హెడ్ ట్రాక్షన్ లైన్లు లైవ్‌గా పరిగణింపబడతాయి మరియు అనధీకృత వ్యక్తి ఎవరూ కూడా సదరు ఓవర్‌హెడ్ లైన్ సమీపంలోకి ప్రవేశించరాదు లేదా పని చేయరాదు.

| సెక్షన్ | తేది |
|---|---|
| ట్రాక్షన్ మాస్ట్ లొకేషన్: SCCL/2 (Ch:/842.146) నుండి లొకేషన్: SCCL/41 & 42 (Ch:2515.376) వరకు సికింద్రాబాద్ డివిజన్‌లోని కాజీపేట్ – బల్హార్షా సెక్షన్‌లో ఆసిఫాబాద్ రోడ్ స్టేషన్ నుండి మొదలయ్యే బ్రేక్ వ్యాన్ సైడింగ్ మరియు కొత్త ఇంజిన్ ఎస్కేప్ లైన్‌తో మార్పుచేసిన ప్రస్తుతమున్న SCCL సైడింగ్ విద్యుదీకరణ. | 05.01.2024 |

A0003 సీనియర్ డివిజినల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్/TrD/సికింద్రాబాద్


# కొండెక్కిన ధూప దీపం!

- ఎన్నికల కోడ్ వచ్చినప్పటి నుంచి నిలిచిన వేతనాలు
- ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న అర్చకులు, ఉద్యోగులు
- ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిన దేవాదాయశాఖ



హైదరాబాద్, జనవరి 1(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ఆలయాల్లో ధూప, దీప, నైవేద్యాలకు ఆటంకం ఏర్పడింది. దీంతోపాటు అర్చకులు, అర్చక ఉద్యోగులు, బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌లోని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా కొంతకాలంగా వేతనాలు నిలిచిపోయాయి. దీంతో అర్చకులు, ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారు. రాష్ట్రంలోని 6,271 ఆలయాల్లో ప్రస్తుతం ధూప, దీప, నైవేద్యం పథకం అమలవుతున్నది. ఈ పథకం కింద ఒక్కో ఆలయానికి రూ.10 వేలు ప్రభుత్వం అందజేస్తున్నది. ఇందులో రూ.4,000 ఆలయాల్లో ధూప, దీప, నైవేద్యాలకు, మిగిలిన రూ.6000 అర్చకుల గౌరవ వేతనంగా నిర్ణయించారు. డీడీఎన్ పథకం కింద తొలుత ఒక్కో ఆలయానికి రూ.2,500 మాత్రమే ఇవ్వగా కేసీఆర్ ప్రభుత్వం రూ.10,000కు పెంచింది. ఈ పథకానికి సంబంధించిన నిధులను ప్రభుత్వం మూడు–నాలుగు నెలలకోసారి విడుదల చేస్తున్నది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో దేవాదాయ శాఖ నుంచి ప్రతిపాదన పంపడంలో జాప్యం జరిగింది. దీంతో ఎన్నికలకు ముందు నుంచి వేతనాలు నిలిచిపోయాయి. వీరితోపాటు గ్రాంట్ ఇన్ ఎయిడ్ అర్చకులు, అర్చక ఉద్యోగులకు కూడా వేతనాలు అందడంలేదు. దాదాపు 3,500 ఆలయాల్లోని అర్చకులు, అర్చక ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా గ్రాంట్ ఇన్ ఎయిడ్ ద్వారా వేతనాలు ఇచ్చే కార్యక్రమానికి కేసీఆర్ ప్రభుత్వం శ్రీకారం చుట్టినప్పటికీ, వీరికి ఎన్నికలకు ముందు నుంచి వేతనాలు అందడంలేదు. వేతనాల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించామని, ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన వెంటనే డీడీఎన్ నిధులు, అర్చకులకు వేతనాలు విడుదల చేస్తామని అధికారులు తెలిపారు. తెలంగాణ ఏర్పాటు తరువాత రాష్ట్రంలో బ్రాహ్మణుల సంక్షేమ పరిషత్ ద్వారా కేసీఆర్ సర్కారు బ్రాహ్మణుల సంక్షేమం కోసం దాదాపు రూ.230 కోట్లు, ఆలయాల అభివృద్ధి కోసం దాదాపు రూ.3,000 కోట్లు వెచ్చించింది. డీడీఎన్ పథకం, గ్రాంట్ ఇన్ ఎయిడ్ ద్వారా 9,771 ఆలయాల్లో అర్చకులకు వేతనాలు ఇవ్వడంతోపాటు నిత్యం ధూప, దీప, నైవేద్యం కార్యక్రమాలు కొనసాగేలా చర్యలు తీసుకున్నది.

# పారిశుద్ధ్య కార్మికుల గౌరవం పెంచాం

- మూడుసార్లు వేతనాలు పెంచాం
- భవిష్యత్తులోనూ అండగా ఉంటాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- నూతన సంవత్సర వేడుకల్లో పారిశుద్ధ్య కార్మికులతో కలిసి భోజనం



*తెలంగాణభవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో కరచాలనం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికురాలు. చిత్రంలో జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి*

హైదరాబాద్, జనవరి 1 (నమస్తే తెలంగాణ): పారిశుద్ధ్య కార్మికుల గౌరవాన్ని పెంచిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మూడుసార్లు శానిటరీ కార్మికులకు వేతనాలు పెంచిందని గుర్తు చేశారు. సోమవారం ఆయన తెలంగాణభవన్‌లో నూతన సంవత్సర వేడుకలను పారిశుద్ధ్య కార్మికులతో కలిసి జరుపుకున్నారు. వారితో కలిసి భోజనం చేశారు. కేటీఆర్‌తో పారిశుద్ధ్య కార్మికులు సెల్ఫీలు దిగారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. పట్టణాలు, పల్లెల పరిశుభ్రతలో అత్యంత కీలకమైన పారిశుద్ధ్య కార్మికులకు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చిందని చెప్పారు. భవిష్యత్తులోనూ వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. జీహెచ్ఎంసీ పరిధిలోని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి ప్రయత్నిస్తామని చెప్పారు. ఈ విషయంలో జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మితో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను కేటీఆర్ దృష్టికి తీసుకొచ్చారు. జీతాల పెంపుతో పాటు ఆరోగ్య, ఉద్యోగ భద్రత కల్పించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు.

### కేటీఆర్‌కు శుభాకాంక్షల వెల్లువ

తెలంగాణభవన్‌లో కేటీఆర్‌కు పలువురు నేతలు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కేటీఆర్‌ను కలిసినవారిలో మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, చామకూర మల్లారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, వీ శ్రీనివాస్‌గౌడ్, ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, బీబీ పాటిల్, బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్యేలు బండారి లక్ష్మారెడ్డి, దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు భేతి సుభాష్‌రెడ్డి, గంద్ర వెంకటరమణారెడ్డి, ఆల వెంకటేశ్వరరెడ్డి, శానంపూడి సైదిరెడ్డి, నోముల భగత్, పైళ్ల శేఖర్‌రెడ్డి, రమావత్ రవీంద్రకుమార్, ఆశన్నగారి జీవన్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, దాస్యం వినయ్‌భాస్కర్, కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు రాజీవ్‌సాగర్, దూదిమెట్ల బాలరాజుయాదవ్, రజిని సాయిచంద్, గజ్జెల నగేశ్, నందికంటి శ్రీధర్, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, పార్టీ నాయకులు జీ రాజేశంగౌడ్, కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి, పల్లా ప్రవీణ్‌రెడ్డి, దరువు ఎల్లన్న, తలసాని సాయికిరణ్, సుధాకర్‌రెడ్డి, ఆటో యూనియన్ నేత వేముల మారయ్య, విద్యార్థి నాయకులు ఉన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా తనను కలిసేందుకు వివిధ ప్రాంతాల నుంచి భారీసంఖ్యలో తరలి వచ్చిన కార్యకర్తలతో కేటీఆర్ సంభాషించారు.




# ఎన్నికల నామ సంవత్సరం

▸ మొదటిపేజీ తరువాయి...

పదవీకాలం ఈ ఏడాదే ముగియనున్నది. ప్రస్తుతం కొనసాగుతున్న సర్పంచ్‌లు 2019 ఫిబ్రవరి 2న బాధ్యతలు స్వీకరించారు. వారి పదవీ కాలం ఫిబ్రవరి 1తో ముగియనున్నది. ప్రస్తుత ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు, జడ్పీటీసీ సభ్యులు 2019 జూన్ 7న ఎన్నికయ్యా రు. వారి పదవీకాలం జూన్ 6తో పూర్తవుతుంది. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు ఆరు గ్యారెంటీలతోపాటు ఇతర హామీలను నెరవేర్చాల్సి ఉన్నది. రాజ్యసభ, లోక్‌స భ, ఎమ్మెల్సీ, స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యం లో ఈ ఏడాదిలో అత్యధిక కాలం ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుంది. దీంతో కొత్త సర్కారు హామీలను అమలు చేసేందుకు ఎన్నికల కోడ్ అడ్డంకిగా మారే అవకాశం ఉంటుందని నిపుణులు భావిస్తున్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చేలోగానే హామీలన్నింటినీ అమలు చేయాలని ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# ఓటు నమోదుకు మరో మూడు రోజులే

• **ఈ నెల 5తో ముగియనున్న గడువు**

హైదరాబాద్, జనవరి 1 (నమస్తే తెలంగాణ): సార్వత్రిక ఎన్నికల్లో ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవడానికి మరో మూడు రోజులే గడువు మిగిలింది. జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు, ఇప్పటి వరకు ఓటుహక్కు లేని వారు తమ ఓటుహక్కు నమోదు చేసుకోవడానికి కేంద్ర ఎన్నికల సంఘం ఈ నెల 5వ తేదీ వరకు అవకాశం ఇచ్చింది. కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 8న తుది ఓటరు జాబితాను ప్రకటించనున్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకోవడానికి ప్రస్తుతం కొనసాగుతున్న ఓటరు జాబితా సవరణలో దరఖాస్తు చేసుకున్న వారికి అవకాశం లభించనున్నది. ఓటరు చిరునామా మార్పు, వివరాలను సరిచేసుకోవడం, చనిపోయిన వారు, నివాసం మారిన వారి ఓట్లను తొలగించేందుకు వెసులుబాటు ఉన్న ది. అందిన దరఖాస్తులపై ఈ నెల 6 నుంచి ఫిబ్రవరి 22 వరకు విచారణ చేస్తారు. ఆన్‌లైన్ ద్వారా https://voters.eci.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని ఎన్నికల సంఘం తెలిపింది. ఆఫ్‌లైన్ ద్వారా తహసీల్ కార్యాలయాల్లో దరఖాస్తులు అందించవచ్చని పేర్కొన్నది.

# మేడారం బస్సుల్లో నో..ఫ్రీ!

- జాతర్లలో మహిళలకు ఉచిత ప్రయాణం బంద్
- స్పెషల్ బస్సులు నడపాలని అధికారులకు ఆదేశాలు!
- ప్రత్యేక సందర్భాల్లో ఫ్రీ ఉత్తమాటే
- ఉచిత ప్రయాణం దూరం చేసేందుకు సర్కారు వ్యూహం

హైదరాబాద్, జనవరి 1 (నమస్తే తెలంగాణ): మేడారం జాతరకు ఆర్టీసీ ప్రయాణికులకు చార్జీల మోత మోగనున్నది. సమ్మక్క–సారలమ్మ జాతర సందర్భంగా పూర్తిగా స్పెషల్ బస్సులనే నడుపాలని ప్రభుత్వం ఆర్టీసీ అధికారులను ఆదేశించినట్టు తెలిసింది. తద్వారా మహాలక్ష్మి పథకం కింద బస్సుల్లో మహిళలకు కల్పిస్తున్న ఉచిత ప్రయాణాన్ని దూరం చేసేందుకు వ్యూహం రచించింది. జనవరిలో సంక్రాంతి పండుగ, ఫిబ్రవరిలో సమ్మక్క–సారలమ్మ జాతల నేపథ్యంలో ఆర్టీసీ బస్సుల్లో లక్షలాది మంది మహిళలు ప్రయాణం చేసే అవకాశం ఉన్నది. అదే జరిగితే నష్టం తప్పదనే భయం ప్రభుత్వంలో నెలకొన్నది. దీంతో పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్‌ల స్థానంలో ప్రత్యేక బస్సులను నడిపించి చార్జీలు వసూలు చేయాలని ఆర్టీసీని ఆదేశించినట్టు తెలుస్తున్నది.

### మహిళల ఉచిత ప్రయాణానికి ఎసరు

మహాలక్ష్మి పథకం అమలులో టీఎస్ఆర్టీసీ అధికారులకు రోజుకో కొత్త అనుభవం ఎదురవుతున్నది. బస్సుల్లో ఉచిత ప్రయాణం కార్యక్రమం అమలుకు ముందు నిత్యం రూ.11 కోట్ల నుంచి రూ. 18 కోట్ల ఆదాయం వచ్చేది. ప్రస్తుతం బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణంతో ఆక్యుపెన్సీ పెరిగినా, ఆదాయం భారీగా పడిపోయింది. రోజు సంస్థ ఆదాయం రూ.7 కోట్ల నుంచి రూ.9 కోట్లకు పడిపోయింది. ప్రభుత్వం ఇస్తామని చెప్తున్న రీయింబర్స్‌మెంట్ చెల్లించే వరకూ ఈ భారాన్ని ఆర్టీసీ భరించాల్సి ఉన్నది. ఈ క్రమంలో సమక్క–సారలమ్మ జాతర నేపథ్యంలో లక్షల మంది మహిళలు బస్సుల్లో ప్రయాణిస్తే ఆర్టీసీ నిండా మునిగే ప్రమాదమున్నది. ఈ నేపథ్యంలో మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి ప్రభుత్వం చెక్ పెట్టే దిశగా అడుగులు వేస్తున్నది. పల్లెవెలుగు, ఆర్టీసీ బస్సులను తగ్గించి పూర్తిస్థాయిలో స్పెషల్ బస్సులను నడిపించాలని ఆర్టీసీని ఆదేశించినట్టు సమాచారం. ఇప్పటికే రవాణాశాఖ మంత్రి ఆర్టీసీ అధికారులతో చర్చించినట్టు తెలిసింది. స్పెషల్ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి అనుమతి లేదని ఇప్పటికే ప్రకటించిన నేపథ్యంలో ప్రజల నుంచి వ్యతిరేకత ఉండదని భావిస్తున్నట్టు తెలుస్తున్నది. ప్రభుత్వం వ్యూహాత్మకంగా బస్సుల్లో మహిళ ఉచిత ప్రయాణాన్ని తొలగించే ప్రయత్నాలు చేస్తున్నదని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

### పొరుగు రాష్ట్రాల బస్సులపై ప్రభావం

మహాలక్ష్మి పథకంతో టీఎస్ఆర్టీసీ బస్సులు కిటకిటలాడుతున్నా.. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల బస్సులపై ఈ ప్రభావం కనిపిస్తున్నది. తెలంగాణకు వచ్చివెళ్లే ఆయా రాష్ట్రాల బస్సుల్లో సీట్ల భర్తీ నిష్పత్తి (ఓఆర్)లో తగ్గుదల కనిపిస్తున్నట్టు అధికారులు చెప్తున్నారు. అదే సమయంలో టీఎస్ఆర్టీసీ సూపర్ లగ్జరీ, ఏసీ బస్సుల్లోనూ ప్రయాణికులు తగ్గారు. హైదరాబాద్ నుంచి ఏపీ, కర్ణాటక రాష్ట్రాలకు వెళ్లే టీఎస్ఆర్టీసీ బస్సుల్లో రాష్ట్ర చిరునామాతో గుర్తింపు కార్డులు ఉన్న మహిళలు రాష్ట్ర సరిహద్దుల వరకు ఫ్రీగా ప్రయాణించి.. అక్కడి నుంచి చార్జీలు చెల్లిస్తున్నారు. దీంతో ఆయా రాష్ట్రాల బస్సుల్లో ప్రయాణించే వారి సంఖ్య తగ్గిందని అక్కడి అధికారులు భావిస్తున్నారు. కాగా, అంతర్రాష్ట్ర బస్సుల్లోనూ మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించాలనే డిమాండ్ పెరుగుతున్నది. ఈ నేపథ్యంలో సర్కార్ తాజా నిర్ణయంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.




# ఇగం.. జనం ఆగమాగం!

- భారీగా పెరిగిన చలి తీవ్రత
- రంగారెడ్డి జిల్లా తాళ్లపల్లిలో అత్యల్పంగా 10.4 డిగ్రీలు
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం



హైదరాబాద్, జనవరి 1 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా ఇడువని ఇగం.. జనాన్ని ఆగమాగం చేస్తున్నది. ఉత్తర, ఈశాన్య దిశల నుంచి తెలంగాణలోకి బలమైన గాలులు వీస్తున్నందున చలి తీవ్రత పెరిగిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. మరో రెండ్రోజులపాటు చలి తీవ్రత ఇంకా ఎక్కువగా ఉంటుందని అధికారులు తెలిపారు. రాష్ట్రంలో మంగళ, బుధవారాల్లో చలి గాలులు మరింత విస్తరిస్తాయని పేర్కొన్నారు. హైదరాబాద్‌తోపాటు ఏజెన్సీ జిల్లాలైన ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, మెదక్, రంగారెడ్డి జిల్లాల్లో 11 నుంచి 15 డిగ్రీల మధ్య కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని తెలిపారు. ఆదివారం రాత్రి రంగారెడ్డి జిల్లా తాళ్లపల్లిలో రాష్ట్రంలోనే అత్యల్పంగా 10.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. పలు జిల్లాల్లో 15 డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఆదిలాబాద్ జిల్లా సోనాల్‌లో 10.7, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్‌లో 11.2, నాగర్‌కర్నూల్ జిల్లా కొండారెడ్డిపల్లిలో 11.7, సంగారెడ్డి జిల్లా అల్మాయిపేటలో 12.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్టు అధికారులు తెలిపారు. చలితో పాటు విపరీతమైన దట్టమైన పొగ మంచు కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



*పోలీసు సేవా పతకాలకు ఎంపికైన బీ సుధాకర్‌రావు, పీ రమేశ్, ఆర్ ఆదర్శ్, మహమ్మద్ ఇజాజ్*

# 636 మందికి పోలీసు సేవా పతకాలు

- 'నూతన' కానుకగా ఉత్తర్వులు
- ఏడుగురికి రాష్ట్ర శౌర్య పతకాలు

హైదరాబాద్, జనవరి 1 (నమస్తే తెలంగాణ): 'న్యూ ఇయర్ డే'ను పురస్కరించుకొని రాష్ట్ర హోంశాఖ 636 మందికి పోలీసు పలు సేవా పతకాలను సోమవారం ప్రకటించింది. రాష్ట్ర పోలీసు విభాగానికి చెందిన ఏసీబీ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, టీఎస్ఎస్పీ, అగ్నిమాపకశాఖ, రైల్వేఫోర్సుల్లోని విభాగాల్లో విశిష్ట సేవలందించిన వారికి ఈ పతకాలు వరించాయి. అత్యుత్తమ సేవలందించిన ఏడుగురికి (పోలీసు 1, ఫైర్‌శాఖ 6) 'తెలంగాణ రాష్ట్ర శౌర్య పతకం' అందించనున్నారు. పతకం పొందిన ఏడుగురికి ప్రతినెలా వారి వేతనంలో రూ.500 ఇంక్రిమెంట్ కలువనున్నది. 'తెలంగాణ రాష్ట్ర మహోన్నత సేవా పతకం' 10 మందికి ప్రకటించారు. తెలంగాణ రాష్ట్ర ఉత్తమ సేవా పతకం 104 మందికి అందించనున్నారు. కఠిన తెలంగాణ రాష్ట్ర సేవా పతకం 42 మందిని వరించింది. తెలంగాణ రాష్ట్ర సేవా పతకం 473 మందికి అందించనున్నారు.

### తెలంగాణ రాష్ట్ర శౌర్య సేవా పతకం పొందిన వారు

**1. కే ఉపేందర్, జేసీ, గ్రేహౌండ్స్**

**అగ్నిమాపకశాఖలో..**

**2. బీ సుధాకర్‌రావు, డీడీ (ఆర్ఎఫ్‌వో) హైదరాబాద్**
**3. పీ రమేశ్ ఎస్ఎఫ్‌వో, మహేశ్వరం, రంగారెడ్డి**
**4. సీ నవీన్‌కుమార్, ఫైర్‌మెన్, జడ్చర్ల, మహబూబ్‌నగర్**
**5. పీ నాగయ్య, లీడింగ్ ఫైర్‌మెన్, హైదరాబాద్**
**6. ఆర్ ఆదర్శ్, ఫైర్‌మెన్ అసెంబ్లీ ఫైర్‌స్టేషన్, హైదరాబాద్**
**7. మహమ్మద్ ఇజాజ్, ఫైర్‌మెన్, అసెంబ్లీ ఫైర్‌స్టేషన్, హైదరాబాద్**